# ఎన్నికలు - పౌరహక్కుల దృక్పథం



పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా పీపుల్స్‌వార్ కార్యకర్తలు ఎన్నికల ప్రక్రియను బలప్రయోగంతో ఆటంకపరచడాన్ని ఖండిస్తూ ప్రకటనలు ఇచ్చాము. ఎన్నికలు అయిపోయిన తరువాత కేవలం ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నందుకు వాళ్ళు కొందరికి 'దేహశుద్ధి' చేయడాన్ని కూడ ఖండిస్తూ ప్రకటనలు ఇచ్చాము. దీనికి వివరణ కావాలని కార్యవర్గంలో కోరడం జరిగింది. ఇక్కడ రెండు విషయాలను వివరించాలి.

**1.** ఎన్నికల వ్యవస్థను మనం ఏ విధంగా చూడాలి? రాజకీయాలలో ప్రజాభీష్టం వ్యక్తం కావడానికొక సాధనంగా ఎన్నికల వ్యవస్థ చరిత్రలో ముందుకొచ్చింది. ప్రజాభీష్టం కేవలం ఎన్నికల రూపంలోనే వ్యక్తం కానవసరం లేదనీ, ప్రజాఉద్యమాలు తదితర రాజకీయ కార్యకలాపాలన్నీ ప్రజాభీష్ట వ్యక్తీకరణ రూపాలేననీ మనం నొక్కి చెప్తాము. అంతమాత్రం చేత ప్రజాభీష్టం వ్యక్తంచేసే ఒక సాధనంగా ఎన్నికల వ్యవస్థను గుర్తించకుండా ఉండము. ప్రస్తుతం భారత రాజకీయాలలో ఎన్నికల వ్యవస్థ వాస్తవానికి ప్రజాభీష్టాన్ని ఏ మేరకు వ్యక్తం చేయగలుగుతూ వుంది అనే విమర్శను ప్రాతిపదికగా తీసుకొని మనం గత రెండు సంవత్సరాలుగా ఎన్నికల సందర్భంగా ప్రచార ఆందోళనా కార్యక్రమం నిర్వహిస్తున్నాం. ప్రజాస్వామ్య రాజకీయాలలో ఎన్నికల పాత్రను గుర్తిస్తున్నాము కాబట్టే జంటనగరాల శాఖ కరపత్రం శీర్షికలో రాసినట్టు ఎన్నికల నిర్వహణకూ ఎన్‌కౌంటర్లు ఆపడానికీ పోటీపెట్టి మాట్లాడడం సరయినది కాదు. ఎన్నికలు సక్రమంగా నిర్వహించవలసిందే, ఎన్‌కౌంటర్లూ ఆపవలసిందే. ఇందులో ప్రజాస్వామ్యానికి ఒకటి అవసరం, మరొకటి అనవసరం కాదు.

**2.** మనం ప్రజలకు ఎన్నికలలో పాల్గొనే హక్కు, బహిష్కరించే హక్కు రెండూ సమానంగా ఉన్నాయంటున్నాం. పీపుల్స్‌వార్ బహిష్కరణ పిలుపును వమ్ముచేయడానికి పోలీసులు బలప్రయోగానికి పాల్పడడాన్ని విమర్శిస్తున్నాం, దాని గురించి ఆందోళన చేస్తున్నాం. అదే విధంగా పాల్గొనదలుచుకున్నవారి హక్కుకు పీపుల్స్‌వార్ అయినా, మరొకరయినా బలప్రయోగంతో అడ్డుపడడం అప్రజాస్వామిక చర్య. ఇది రాజకీయ స్వేచ్ఛకు సంబంధించిన విషయం. కేవలం వోటర్లపైన దాడిచేస్తే మాత్రమే అప్రజాస్వామికం కాదు. ఎన్నికల ప్రచారానికి బలప్రయోగంతో అడ్డుపడడం, ప్రచారంలో పాల్గొన్న వారిపైన హింసకు పాల్పడడం, పోలింగ్ ఏజెంట్లుగా కూర్చున్న వారిని హింసించడం మొదలయినవన్నీ కూడ అప్రజాస్వామిక చర్యలే. ఆ పార్టీల రాజకీయాలు ఎంత భ్రష్టుపట్టినవయినా కావచ్చును. కాని ప్రచారం చేసుకునే స్వేచ్ఛ, ఎన్నికలలో పాల్గొనే స్వేచ్ఛ వారి రాజకీయ హక్కులు. వాటి మంచిచెడులు నిర్ణయించుకునే హక్కు, బాధ్యత ప్రజలది. వారిని నిలదీసి ప్రశ్నించే హక్కు ప్రజలది. అన్ని పార్లమెంటరీ పార్టీలకూ ప్రజలలో అనుచరులున్నారు, సానుభూతిపరులున్నారు. ఆ పార్టీల ఎన్నికల ప్రచారాన్ని బలప్రయోగంతో అడ్డుకోవడం ఆ ప్రజల రాజకీయ స్వేచ్ఛను అడ్డుకోవడమే అవుతుంది. అందువల్లనే అటువంటి దాడులను ఖండిస్తున్నాం. (ఎన్నికల బహిష్కరణ పిలుపునే ఖండిస్తున్నట్లు 'వార్త'లో వచ్చిన ప్రకటన ఆ పత్రిక మార్కాపురం విలేకరి నేను చెప్పినది అర్థం చేసుకోకపోవటం వల్ల జరిగిన పొరపాటు.)

*'వివరణ' పేరుతో ఎ.పి.సి.ఎల్.సి కార్యవర్గానికి రాసిన లేఖ*
*14 జూన్ 1996*